
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భద్రాద్రి కొత్తగూడెం

ఉష్ణోగ్రత | ఖమ్మం: గరిష్ఠం 31 । కనిష్ఠం 21 | భద్రాద్రి: గరిష్ఠం 34 । కనిష్ఠం 24 | ఆదివారం, 4 ఫిబ్రవరి 2024





అపాయింట్‌మెంట్ లెటర్ అందజేస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

భళా.. జాబ్ మేళా!

- వెల్లువెత్తిన నిరుద్యోగ యువత
- కిక్కిరిసిన సర్దార్ పటేల్ స్టేడియం
- 11,530 మంది హాజరు... 1,122 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు
- 2,698 మంది ఫైనల్ ఇంటర్వ్యూలకు ఎంపిక
- ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ గౌతమ్



హుషారుగా జాబ్‌మేళాకు..

నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిరుద్యోగ భారతం కళ్లకు కట్టింది. యువత కొలువుల కలలను సజీవంగా సాక్షాత్కరింప చేసింది. పోటీ ప్రపంచం ఏ స్థాయిలో ఉందో అనుభవంలోకి తెచ్చింది. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, టీఎస్ సెట్ప్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 65 కంపెనీలు ఏర్పాటు చేసిన కౌంటర్లలో దాదాపు 11,530 మంది నిరుద్యోగులు తమ బయోడేటాలను అందజేశారు. వీరిని వివిధ దశల్లో వడపోసి సుమారు 1,122 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. 2,698 మందిని ఫైనల్ ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. జాబ్‌మేళాలో ఉద్యోగం పొందిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎదగాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. చిన్న ఉద్యోగాలని నిర్లక్ష్యం చేయకూడదని కోరారు. కాగా, కొందరు మహిళా అభ్యర్థులు చంటి పిల్లలతో తరలివచ్చి ఇంటర్వ్యూలకు హాజరు కావడం విశేషం. మొత్తంగా సర్దార్ పటేల్ స్టేడియం రోజంతా నిరుద్యోగుల ఆశలకు వేదికగా నిలిచింది.

-ఖమ్మం స్పోర్ట్స్

7



జాబ్‌మేళాకు చంటిపాపతో వచ్చిన అభ్యర్థిని





నేనే.. కాదు నేనే...

- రసకందాయంలో డీసీఎంఎస్ చైర్మన్ పదవి
- మళ్లీ రాయల వర్సెస్ కొత్వాల
- ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాలతో అయోమయం

7




ఆరు అంశాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు

- సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి
- అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో మేయర్ నీరజ

8

పొలిటికల్ హీట్

- లోక్‌సభ ఎన్నికలకు పోటాపోటీగా ప్రధాన పార్టీల సన్నద్ధం
- ఇప్పటికే కాంగ్రెస్ టికెట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తి
- సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్ నేతల బిజీ బిజీ
- షెడ్యూల్‌కు ముందే రాజకీయ సందడి



ఖమ్మం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు పోటాపోటీగా సన్నద్ధమవుతున్నాయి. ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్లు ఆశిస్తున్న వారి నుంచి కాంగ్రెస్ పార్టీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తిచేయగా బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుకోసం నియోజకవర్గస్థాయి సమావేశాలను ప్రారంభించింది. దీంతో జిల్లా రాజకీయం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే వేడెక్కుతోంది.

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో జోష్‌లో ఉండగా అభ్యర్థుల ఎంపికకోసం శనివారంతో దరఖాస్తుల ప్రక్రియ పూర్తిచేసింది. ఖమ్మం ఎంపీ టికెట్ కోసం కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నేత రాయల నాగేశ్వరరావు, వీవీసీ వ్యాపార సంస్థల అధిపతి వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, పీసీసీ అధికారి ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి, మాజీ డీహెచ్ గడల శ్రీనివాసరావు తదితరులు దరఖాస్తు చేశారు.

అయితే ఖమ్మం నుంచి కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ పోటీచేయాలని ఆహ్వానించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. సోనియాగాంధీ నిర్ణయాన్ని బట్టి ఖమ్మం ఎంపీ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ జరగనుంది. దరఖాస్తుదారులంతా సోనియాగాంధీ పోటీచేస్తే గెలిపించుకుంటామని, ఆమె పోటీచేయని పక్షంలో టికెట్ తమకే ఇవ్వాలన్న డిమాండ్‌తో ఉన్నారు. ఎవరికివారు ఖమ్మం టికెట్ తెచ్చుకుంటే గెలుపుకు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని భావిస్తున్నారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తికావడంతో టికెట్‌కోసం లాబీయింగ్ ప్రారంభించారు. కనీసం టికెట్ రేసులో ఉంటే టికెట్ దక్కకపోయినా తర్వాత పార్టీనుంచి నియామక పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని ఆశావహులు భావిస్తున్నారు.

కాగా విపక్ష బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు పేరును ఏకగ్రీవంగా నిర్ణయించింది. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ కూడా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్తుపల్లి సభలో ఖమ్మం ఎంపీ స్థానానికి నామా నాగేశ్వరరావు పోటీచేస్తారని ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆయన పేరు దాదాపు ఖరారైనట్లేనని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఇక బీఆర్ఎస్ మహబూబాబాద్ టికెట్‌కు కవిత పేరు ప్రచారంలో ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ఆ పార్టీ ప్రారంభించింది. కొత్తగూడెంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, భద్రాచలంలో మాజీమంత్రి హరీశ్‌రావులు నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని శనివారం కోరారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కొత్తగూడెం సభకు హాజరుకాగా భద్రాచలంలో మాజీమంత్రి హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, ఎంపీ కవిత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తదితరులు పాల్గొన్నారు. మహబూబాబాద్ కాంగ్రెస్ టికెట్‌కోసం కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌తోపాటు మరో 20మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని మాజీమంత్రులు, ఎంపీలు విజ్ఞప్తిచేశారు. దీంతో ఉమ్మడిజిల్లాలో అసెంబ్లీ ని యోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. మరోవైపు బీజేపీ కూడా ఎన్నికల కదన రంగానికి సిద్ధమవుతోంది.

భారీ మెజారిటీతో గెలుస్తా...

- ఖమ్మం ఎంపీ టికెట్‌కు మల్లు నందిని దరఖాస్తు
- మధిర నుంచి ర్యాలీగా హైదరాబాద్‌కు పయనం



దరఖాస్తు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి సతీమణి నందిని

మధిర టౌన్, ఫిబ్రవరి 3: ఖమ్మం పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ టికెట్ కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదిహేను ఏళ్లుగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఎనలేని కృషి చేశానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే తాను అభ్యర్థినైతే ఖమ్మం ఎంపీ సీటును కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో కైవసం చేసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొందయ్య, నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ పాల్గొన్నారు.

కాగా మల్లు నందిని దరఖాస్తు అందజేసే కార్యక్రమానికి మధిర మండలం నుంచి ఆపార్టీ శ్రేణులు కార్లతో భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. మధిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ర్యాలీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ జెండాఊపి ప్రారంభించారు. హైదరాబాద్‌కు వెళ్లినవారిలో కిసాన్‌సెల్ అధ్యక్షుడు దుంపా వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు చిట్టిబాబు, మధార్ నాయకులు కర్నాటి రామారావు, వంశీ, పారుపల్లి విజయ్, బాలరాజు, టి.వి. రెడ్డి, చెరుకూరి నాగార్జున, పి.సత్యంబాబు, టి.రామకృష్ణ, రామరాజు, నరసింహరావు,హరిబాబు, అద్దంకి రవి, జహంగీర్, రమణ, ఉద్దండయ్య, కరివేద రాంబాబు ఉన్నారు.

గత ప్రభుత్వ పనులు ఆపొద్దు

- ఎంపీ నామా నాగేశ్వరరావు ఆదేశం
- వాడి వేడిగా 'దిశ' సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిర్మాణంలో ఉన్న పనులు ఆపొద్దని 'దిశ' (డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్) కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. ఖమ్మం డీపీఆర్సీ భవన్‌లోని సమావేశ మందిరంలో దిశ కమిటీ సమావేశం జరిగింది. పలు అంశాలపై వాడివేడి చర్చ జరిగింది.

ఈ సందర్భంగా పలు మునిసిపాలిటీలకు చెందిన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన, నిర్మాణంలో ఉన్న పనులు చేపట్టవద్దని అధికారులు సూచిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన నామా అలాంటి చర్యలకు పాల్పడవద్దని అధికారులకు సూచించారు. రైల్వేశాఖపై జరిగిన చర్చలో డోర్నకల్ నుంచి గద్వాలకు రైల్వేలైన్ సర్వే జరుగుతున్నందున అటు వైపుగా జాన్‌పాడ్‌కు రైల్వేలైన్ నిర్మిస్తే దూరం తగ్గడంతోపాటు బ్రిడ్జిలు ఎక్కువగా నిర్మించాల్సిన అవసరంలేదని, ఇందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని కొందరు సభ్యులు సూచించగా అందుకు నామా సుముఖత వ్యక్తం చేశారు. రైల్వేశాఖలో చేపట్టే అభివృద్ధి పనులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఆహ్వానం ఇవ్వడం లేదని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఎమ్మెల్సీ తాతా మధు రైల్వే అధికారులను ప్రశ్నించారు. దీంతో 30నిమిషాల పాటు రైల్వే ప్రొటోకాల్‌పై రగడ చోటుచేసుకుంది.

నూతనంగా నిర్మాణం జరుగుతున్న రైల్వే లైన్‌కు సంబంధించిన అధికారులు ఎవరూ లేకపోవటం ఏమిటని దిశ మినిట్స్‌లో నమోదు చేసి వివరాలను తనకు అందజేస్తే రైల్వేశాఖకు ఫిర్యాదు చేస్తానని నామా డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. మైనింగ్‌శాఖపై చర్చ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ మూడు రోజులుగా మైనింగ్ అధికారులు దాడులు చేసి భయానక పరిస్థితి సృష్టించి గ్రానైట్ పరిశ్రమలను మూసే పరిస్థితికి తీసుకొచ్చారని మైనింగ్ అధికారులను ప్రశ్నించారు. దీంతో స్పందించిన మైనింగ్ అధికారులు నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. దీంతో స్పందించిన నాగేశ్వరరావు ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే తానే తొలిసారిగా ఖమ్మంలో 1986-87లో ఏర్పాటు చేశానన్నారు. లక్ష్యాల కోసం గ్రానైట్ పరిశ్రమలను మూత వేసే పరిస్థితి తీసుకురావొద్దని అధికారులకు సున్నితంగా హెచ్చరించారు.

భద్రాద్రిలో సాంస్కృతిక సౌరభం

- నేటినుంచి అంతర్ రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 3: భద్రాద్రి కళాభారతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో 22వ అంతర్ రాష్ట్రస్థాయి నాటకోత్సవ సాంస్కృతిక సంబరాలకు భద్రాచలం ముస్తాబైంది.ఆదివారం నుంచి మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాట్లుచేశారు. ఈసారి సూపర్‌సింగర్-3 విన్నర్ అవినాష్ జయసింహ, ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్, జానపద కోయల జంగిరెడ్డి, సునీత ఆట పాట, మాటతో అలరించనున్నారు. ఈ సంబురాలను ఆదివారం రాత్రి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఏఎస్పీ పరితోష్ పంకజ్ ప్రారంభించనున్నారు. వీరితోపాటు భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి, ఐటీసీ యూనిట్ హెడ్ సిద్ధార్థ మహంతి, భద్రాచలం జైల్ సూపరింటెండెంట్ జె.ఉపేంద్ర, ప్రవాస భారతీయులు, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, కళాభారతి అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షుడు తాళ్లూరి పంచాక్షరయ్యలతో పాటు భద్రాద్రి కళాభారతి కార్యవర్గం పాల్గొననుంది. తొలిరోజు స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శించనున్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

కలెక్టర్ ప్రియాంక అల



కొత్తగూడెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల సూచించారు. ఐడీఓసీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ ఓటు నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 22,510 మంది మాత్రమే ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఓటు హక్కు నమోదుకు ఫారం-18 ద్వారా అన్ని తహసీల్దార్ కార్యాలయాలతో పాటు కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవో కారాలయాల్లోనూ దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఆన్‌లైనలోనూ దరఖాస్తులు చేయడానికి అవకాశం ఉందని తెలిపారు. ఓటు నమోదుకు మరో మూడు రోజులు మాత్రమే సమయం ఉన్నందున ఇంకా నమోదు కానివారు తక్షణమే నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటిస్తామన్నారు. అభ్యంతరాలు తెలపడానికి మార్చి 14వ వరకు అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 4న తుది జాబితా ప్రకటిస్తామన్నారు.

ఇల్లెందు అవిశ్వాస కౌన్సిలర్లకు రక్షణ కల్పించాలి

ఉత్తర్వులిచ్చిన హైకోర్టు

ఇల్లెందు టౌన్. ఫిబ్రవరి 3: ఇల్లెందు మునిసిపాలిటీ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాసం తీర్మానం ఇచ్చిన కౌన్సిలర్లకు రక్షణ కల్పించాలని హైకోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశంపై నలుగురు అవిశ్వాస కౌన్సిలర్లు హైకోర్టులో పిటీషన్ వేయగా ఈ మేరకు కౌన్సిలర్ల అందరికీ రక్షణ కల్పించాలని సూచిస్తూ భద్రాద్రి ఎస్పీ, కలెక్టర్‌తోపాటు ఇల్లెందు డీఎస్పీకి, రాష్ట్రస్థాయి పోలీసు ఉన్నతాధికారులకు కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ నెల 5న జరగనున్న అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరయ్యే కౌన్సిలర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉత్తర్వుల్లో కోర్టు పేర్కొంది. కాగా మునిసిపాలిటీలోని 19వ వార్డు కౌన్సిలర్ పత్తి స్వప్న శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. అవిశ్వాస తీర్మాన సమావేశం నేపథ్యంలోనే మంత్రిని కలిసినట్లు ఆమె తెలిపారు. మంత్రి పొంగులేటి తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు.

19న కొత్తగూడెం మునిసిపాలిటీలో అవిశ్వాసం

నోటీసులు జారీ చేసిన కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 3: కొత్తగూడెం మునిసిపాలిటీలో చైర్‌పర్సన్‌పై 19న అవిశ్వాస తీర్మానం కోసం కలెక్టర్ ప్రియాంక అల శనివారం నోటీసు విడుదల చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానాన్ని గత నెల 23న 22మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు అందజేశారు. ఈ క్రమంలో నోటీసులు జారీ చేసిన కలెక్టర్ 19న కొత్తగూడెం మునిసిపాలిటీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానానికి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఏడు మండలాల పాపం కాంగ్రెస్, బీజేపీలదే

- రెండు వార్డులను ఏపీలో కలిపి ఆగమాగం చేశారు
- మహబూబాబాద్ స్థానంలో గులాబీ జెండా ఎగరేయాలి
- బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

భద్రాచలం, ఫిబ్రవరి 3: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన పాపం బీజేపీ, కాంగ్రెస్‌లదేనని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ స్థానంలో గులాబీ జెండా ఎగరేయాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భద్రాచలంలో శనివారం అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ హక్కులు కాపాడాలన్నా.. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలు కోసం ప్రభుత్వం మెడలు వంచి పని చేయించాలన్నా అది బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తలకిందులు తపస్సు చేసినా రాహుల్ ప్రధాని కాలేన్నారు. తెలంగాణ పునర్‌నిర్మాణమమంటే తిట్ల పురాణమా అని ప్రశ్నించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి వాడని అనాగరిక భాషను సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పరువు తీస్తున్నారని విమర్శించారు.

రాష్ట్ర విభజన సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన పాపం బీజేపీ, కాంగ్రెస్‌లదేనని ఆరోపించారు. గతంలో లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టును ఆంధ్రాకు అప్పజెప్పడంతో ప్రతి ఏటా రూ.1500కోట్లు అన్యాయం జరిగిందని, ఇది అప్పజెప్పింది కాంగ్రెస్, బీజేపీలు కాదా అని ప్రశ్నించారు. భద్రాచలం పట్టణంలోని రెండు వార్డులను ఏపీ పరిధిలో కలిపి ఆగమాగం విభజన చేశారని విమర్శించారు.

భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను గెలిపించి పార్టీ పరువును కాపాడిన భద్రాచలం నియోజకవర్గ కుటుంబ సభ్యులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రసంగించారు. సమావేశంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియనాయక్, తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రామయ్యకు పూజలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామిని శనివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు, ఎంపీలు మాలోతు కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అలాగే స్వామి వారిని మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకటవీరయ్య, హరిప్రియనాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా, భద్రాచలం నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

దేశంలో తెలంగాణ అగ్రగామి

- ఆ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

7

భద్రాద్రి మాఘమాస ఉత్సవాలివే..

భద్రాచలం, ఫిబ్రవరి 3: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మాఘమాసంలో నిర్వహించే ఉత్సవాల వివరాలను దేవస్థానం అధికారులు పత్రికలకు విడుదల చేశారు. ఈ నెల 12న భక్తరామదాసు 391వ జయంతిని పురస్కరించుకొని వాగ్గేయకారత్సవాలు ప్రారంభం కానున్నాయి. 16న రథ సప్తమి, వెండి రథ సేవ, చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు. 21న పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, 22న సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ, 23న సహస్ర కలశాశాహనం, 24న సహస్రకలశాభిషేకం, హవనం పూర్ణాహుతి, 28న సుదర్శన హోమం, మార్చి 6న సర్వేశాం ఏకాదశిని పురస్కరించుకొని లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా నెల 23, 24 తేదీల్లో నిత్యకల్యాణాలను నిర్వహించరని దేవస్థానం అధికారులు తెలిపారు. 23న సహస్రకలశాభిషేకం కారణంగ సంధ్యాహారతి సైతం నిర్వహించరని తెలిపారు.

మూడు నెలలుగా తెరుచుకోని గ్యాస్ గోదాం

» వినియోగదారుల ఇక్కట్లు » పట్టించుకోని అధికారులు

వేంసూరు, ఫిబ్రవరి 2: వేంసూరులోని ఇండియన్ గ్యాస్ గోదాం మూడునెలల నుంచి మూసివేయడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వినియోగదారు లు వాపోతున్నారు. ఇటీవల సీపీఐ ఆధ్వర్యంలో గ్యాస్ గోదాం తెరిపించాలని కోరుతూ వినియోగదారులు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గతనెల 31వతేదీ లోపు గోదాంను తెరవాలని లేకుంటే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించినా ఏజన్సీ వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీంతో మండలంలోని ఇండియన్ గ్యాస్ సిలిండర్లను వ్యయప్రయాసలకోర్చి సత్తుపల్లి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. మూడ్నాలుగురోజులపాటు సిలీండర్ల కోసం సత్తుపల్లి వెళ్లాల్సి వస్తుండటంతో తమకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు డబ్బులకు కక్కుర్తి పడి ఏజన్సీ వారికి గడువు ఇస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్యాస్ గోడౌన్ తెరిపించాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రాజును వివరణ కోరగా గ్యాస్ ఏజన్సీ వారు గోదాం తెరిచేందుకు మరో వారంరోజులపాటు గడువు అడిగారని తెలిపారు.



మూతపడిన గోదాం

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి

» ప్రత్యేక కార్యాచరణను అమలుచేయాలి
» పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
» కలెక్టర్లు, అధికారులతో వీడియోకాన్ఫరెన్స్

ఖమ్మం కలెక్టరేట్/ కొత్తగూడెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందించి ప్రత్యేక అధికారుల పాలన ద్వారా అమలు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో గ్రామపంచాయతీల అభివృద్ధిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఇందులో భాగంగా ప్రత్యేక అధికారుల పాలన ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులు, పారిశుధ్య పనులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్



వీసీలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సుల్తానియా మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి కనెక్షన్లపై సర్వే నిర్వహించి, ఇంకా నల్లా కనెక్షన్ లేని ఇళ్ల గుర్తించాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని, అవసరమైన చోట నీటి లీకేజీ మరమ్మతు పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామంలో అంతర్గత నీటి సరఫరా, నూతన నల్ల కనెక్షన్ పనుల ప్రాతిపాదనలు రూపొందించి జల్ జీవన్ మిషన్ ద్వారా నిధులు పొందాలని తెలిపారు. నియోజక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం 10 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని, అట్టి నిధులతో అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాలలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఖమ్మం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 2వ తేదీ నుంచి ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నారన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేం దుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఉపాధి హామీ కూలీల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జిల్లాలో ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు గ్రామపంచాయతీలలో పారిశుద్యం పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని ఆయన తెలిపారు. భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గ్రామ పంచాయతీల విధుల నిర్వహణపై ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పనకు మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో గ్రామాలను పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రతినిధులను, ప్రజలను, మహిళా సంఘాలను, యువతను భాగాస్వాములని చేసి విజయవంతం చేస్తామన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం జడ్పీ సీఈవో వి.వి.అప్పారా వు, డీపీవో హరికిషన్, ఎస్‌ఈ పి.ఆర్ చంద్రమౌళిశ్వరరావు, ఏపీడీ శిరీష, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, వివిధ శాఖల అధికారులు, భద్రాద్రి జడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, మంగ్యా, ఏపీడీ రవి, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి తదితరులు

మునిసిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాసం

● కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల వివాదం కాదు
● స్పష్టం చేసిన అవిశ్వాసం కౌన్సిలర్లు

ఇల్లెందు, ఫిబ్రవరి 3: ఇల్లెందు మున్సిపాలిటీలో కౌన్సిలర్లు చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై పెట్టిన అవిశ్వాస తీర్మాణం రాజకీయ పార్టీల నడుమ నెలకొన్న వివాదం కాదని, అది కేవలం చైర్మన్ పదవిలో ఉన్న డీవీ వ్యక్తిగత ఒంటెద్దు పోకడలు, అనుచిత ప్రవర్తన కారణంగానే అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు వారంతా శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నప్పుడే అవిశ్వాసం పెట్టడం జరిగిందని, కొన్ని మాధ్యమాల్లో చైర్మన్ డీవీపై అవిశ్వాసం బీఆర్‌ఎస్ కాంగ్రెస్ పార్టీల మధ్య వివాదంగా పేర్కొనడంలో నిజం లేదన్నారు. సోమవారం జరిగే అవిశ్వాసం కౌన్సిలర్లు అందరు కలిసి తీసుకున్న సమిష్టి నిర్ణయమని, ఏ పార్టీ కూడా రాజకీయకోణంలో చూడవ ద్దని విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రజల అభీష్టం మేరకే దమ్మాలపాటిపై అవిశ్వాసం పెట్టామని, ఓటింగ్‌కు హాజరవుతున్న తమకు పూర్తి రక్షణ కల్పించా లని ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు.

దాడి కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 3: రోడ్డు విషయంలో మాట్లాడుకుంటూ ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామ కృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుమ్మడివల్లిలో శనివారం వెంకన్న, బి. రామకృష్ణ అనే వ్యక్తులు రోడ్డు విషయంలో ఘర్షణ పడ్డారు. వెంకన్నపై రామకృష్ణ దాడి చేయగా వెంకన్న ఫిర్యాదు మేరకు రామకృష్ణపై దాడికేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నూతన పోలీస్ సాలరీ ప్యాకేజ్ ఆవిష్కరణ

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 3: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సీపీ కార్యాలయంలో పోలీస్ శాలరీ ప్యాకేజ్‌ను సీపీ సునీల్‌దత్ ఆవిష్కరించారు. ఎస్‌బీఐ బ్యాక్ మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న పర్మినెంట్ పోలీస్ ఉద్యోగి ఎవరైనా ఎస్‌బీఐ లో శాలరీ అకౌంట్ ఉంటే అనేక ప్రయోజనాల లబ్ది చేకూరుతాయన్నారు. అదే విధంగా అన్ని రకాల బీమా ప్రయోజనాలు కోటీ 50 లక్షల వరకు వర్తించునని, ముఖ్యంగా ప్రమాద బీమా 75 లక్షల వరకు వర్తిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు జీరో బ్యాలెన్స్ అకౌంట్, ఐదు లక్షల వరకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యం వర్తించనుందని, ఏదైనా లోన్ ప్రాసెసింగ్ చార్జెస్ లో కూడా రాయితీలు వర్తిస్తాయని ఆయన తెలిపారు. అనంతరం సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ పోలీసు సాలరీ ప్యాకేజ్‌లో ఉన్న ప్రయోజనాలను సిబ్బంది ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం సీఎస్‌ఆర్ యాక్టివిటీ కింద అర్హులైన వారికి స్వయం ఉపాధికోసం కుట్టుమిషన్లను సీపీ సునీల్‌దత్ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె.ఆర్.కె.ప్రసాద్‌రావు, ఎస్‌బీఐ అధికారులు, నారాయణ మూర్తి, శంకర్‌రావు, రీజనల్ ఆఫీస్ సిబ్బంది కొల్లా రవీందర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంఓయూ పత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీ సునీల్‌దత్

నాసిరకంగా మరమ్మతు పనులు

» బీటీ పనులను అడ్డుకున్న జాస్తిపల్లి గ్రామస్థులు

కామేపల్లి, ఫిబ్రవరి 3: కామేపల్లి మండల పరిధిలోని కొత్తలింగాల కోటమైసమ్మ ఆలయం నుంచి జాస్తిపల్లి గ్రామానికి ఎంఆర్ఆర్ నిధుల నుంచి రూ.1.15కోట్లతో బీటీ రోడ్డు మంజూరు అయింది. ఈ రోడ్డు నాణ్యత పర్వేక్షణను పంచాయతీరాజ్ శాఖ అధికారులకు అప్పగించారు. రోడ్డును 15రోజుల క్రితము వేశారు. అయితే పంచాయతీ రాజ్ ఏఈ నిర్లక్ష్యం, పర్వేక్షణ లోపంతో రోడ్డు వేసిన మూడు రోజులుకే గుంతలు ఏర్పడ్డాయి. ఆరోడ్డు నాసిరకంగా వేయడంతో బీటీ రోడ్డుపై కంకర తేలి ఎక్కడిక్కడే రోడ్డుకు గుంతలు పడ్డాయి. నాసిరకం రోడ్డుపై ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు జాస్తిపల్లి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఆఫిర్యాదుతో మరల దాని మరమత్తులు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించా రు. కాంట్రాక్టర్ మరల నాసిరకంగా రోడ్డు వేయడంతో జాస్తిపల్లి గ్రామానికి చెందిన గ్రామస్థులు ఆపనిని అడ్డుకున్నారు. గ్రామస్థులు మరల కొత్తలింగాల నుంచి జాస్తిపల్లి వరకు మరో లేయర్ వేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అడవుల పరిరక్షణకు కృషి చేయాలి: ఎఫ్‌డీవో

జూలూరుపాడు, ఫిబ్రవరి 3: గ్రామాలలోని ప్రజలు అడవులను నరకవద్దు అని, వాటిని పరిరక్షించే విధంగా కృషి చేయాలని కొత్తగూడెం ఎఫ్‌డీవో యు.కోటేశ్వరరావు అన్నారు. శనివారం జూలూరుపాడు రేంజ్ పరిధిలోని కనకగిరి అటవీ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. సహజ అటవీ ప్రాంతాన్ని, అటవీ జాతులు, జంతు సంచారం తదితరాలను పరిశీలించారు. ప్లాంటేషన్, జూలూరుపాడు నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం పనులను పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జూలూరుపాడులోని సెయింట్ ఆంథోనీ పాఠశాలలో 6వ, 7వ, 8వ తరగతి విద్యార్థులను వన దర్శిని కార్యక్రమంలో భాగంగా పాపకొల్లు అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అటవీ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సహజ అడవులు, నీటి కుంటలు, చెక్ డ్యామ్‌లు, గండి మైదానాలు, ప్లాంటేషన్, అడవి జంతువులు తదితరాలపై వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవులను ఎవరైన నరికితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వేసవిలో నీటి కోసం అడవులు పొలాలకు వస్తే వాటిని వేటాడవద్దు అని అన్నారు. అడవి జంతువులను వేటాడితే ఉపేక్షించేది లేదని తెలిపారు. అడవుల్లో నిప్పు అంటుకోకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో ప్రసాద్‌రావు, డీఆర్‌వోలు ధనలక్ష్మీ, లక్ష్మీనర్సు, ఎఫ్‌ఎస్‌వో మల్లయ్య, ఎఫ్‌బీవోలు కిషన్, రహీం, విజయలక్ష్మీ, వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్టీ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలను పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో కోటేశ్వరరావు

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 3: ఇల్లెందు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత రైతు సమన్వయ సమితి మాజీ సభ్యుడు పేరుమళ్ల కృష్ణయ్య (44) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. కొంతకాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణయ్య హైదరాబాద్‌లో గాంధీ వైద్యశాలలో చికిత్స నిమిత్తం వెళ్లాడు. శనివారం ఉదయం వైద్యశాలలోనే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తేలు ఉన్నారు. కృష్ణయ్య మృతి పట్ల ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సంతాపం తెలిపారు.


కృష్ణయ్య (ఫైల్)

ఇద్దరు రౌడీషీటర్లు, ఐదుగురు అనుచరుల అరెస్టు

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 3: రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరు రౌడీషీటర్లు, ఐదుగురు అనుచరులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. వైరా మండలం తాటిపుడికి చెందిన ఆవుల అశోక్‌తోపాటు మరో ఐదుగురు అనుచరులు కలిసి దాడులకు, దౌర్జన్యాలకు దిగుతున్న నేపథ్యంలో 15రోజులుపాటు రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. నేరప్రవృత్తి కలిగిన ఆవుల అశోక్ శుక్రవారం అర్ధరాత్రి తన అనుచరులైన గుద్దేటి అశోక్, బచ్చలకూర పుల్లయ్య, నునావత్ శ్రీను, తిమ్మిడి హనుమంతరావు, గడ్డం లక్ష్మణ్‌లతో కలిసి నగరంలోని బైపాస్‌రోడ్డులోని ఓ రెస్టారెంట్‌పై కర్రలతో దాడిచేసి రెస్టారెం ట్‌కు సంబంధించిన వ్యక్తులను గాయపరిచి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో బాధితు లు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో కేసులు నమోదుచేసి అశోక్‌తోపాటు అతని అనుచ రులను రిమాండ్ చేసినట్లు సీపీ తెలిపారు.

కాగా ఇటీవల రెస్టారెంట్ పార్కింగ్ గోడలపై న్యూడెమోక్రసీ పార్టీకి పెయింటింగ్ రాయడం విషయంలో రెస్టారెంట్ నిర్వాహకులతో రౌడీషీటర్‌కు మధ్య జరిగిన వివాదం మనసులో పెట్టుకుని ఈ దాడికి పాల్పడినట్లు సీపీ తెలిపారు. అదేవిధంగా ఖమ్మం వన్‌టౌన్ పరిధిలో పాతనేరస్తుడు, రౌడీషీటర్ అయిన పేరెల్లి ప్రవీణ్‌కుమార్‌ను కూడా వన్‌టౌన్ పోలీసులు అరెస్టుచేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

నగరంలోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ రియల్‌ఎస్టేట్ వ్యాపారి ముసుగులో దందాలు చేస్తూ జడ్పీ సెంటర్‌లో ఓ ఆర్గనైజేషన్ కంపెనీ నుంచి రూ.6 లక్షలు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించకుండా డబ్బులు అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడని సీపీ తెలిపారు ఈనేపథ్యంలో కంపెనీ అధికారుల ఫిర్యాదుమేరకు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. అదేవిధంగా గతంలో ఇతనిపై ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో 21కే సుల్లో అరెస్టయి జైలుకు వెళ్లి ప్రవీణ్ బెయిల్‌పై తిరిగుతున్నాడని, ఏదైనా భూవివాదం ఉంటే తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా ఆక్రమించడం, బాదితులపై దౌర్జన్యం చేయడం అడ్డుకున్న వారిని చంపుతానని బెదిరించడం నైజంగా మారిందని సీపీ తెలిపారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే వదిలేది లేదని, ఎంతటివారైనా సరనే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


లక్ష్మీదేవి(ఫైల్)

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 3: ఇంటి ముందు నిల్చున్న ఓ వృద్ధురా లిని ద్విచక్రవా హనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సత్తుపల్లి మునిసిపాలిటీలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. మృతురాలి కుమారుడు కందుల ముక్తేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక తుమ్మూరు రామారావు వీధికి చెంది న కందుల లక్ష్మీదేవి (70) ఇంటివద్ద నుంచి బయటకు రాగా మెయిన్‌రోడ్ వైపుకు ద్విచక్ర వాహ నంపై అతివేగంగా వెళ్తున్న అదేవీధికి చెందిన ఆటో మెకానిక్ పాషా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన లక్ష్మీదేవిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించగా మృతురాలి కుమారుడు ముక్తేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య యత్నం

కామేపల్లి, ఫిబ్రవరి 3: కుటుంబంలో చిన్న చిన్న గొడవల కారణంగా క్షణికావేశంలో ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి యత్నించిన సంఘటన కామేపల్లి మండల పరిదిలోని అబ్బాస్‌పురంలో శనివారం చోటు చేసుకుంది. అబ్బాస్‌పురం గ్రామానికి చెందిన దారావత్ నెహ్రూ ఇంట్లో కుటుంబంలో చిన్న చిన్న గొడవలు జరిగాయి. శుక్రవారం రాత్రి ఇంట్లో భార్యభర్తలు, తల్లితో గొడవ పడ్డాడు. శనివారం క్షణికావేశంలో వ్యవసాయ భూమికి వద్ద పురుగుల మందు తాగాడు. అపస్మరక స్థితికి వెళ్లాడు. గమనించిన కటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గంజాయి కేసులో నిందితుల రిమాండ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి3: వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న ఇద్దరు గంజాయి నింధితులను కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురిని వెతికేందుకు ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్‌ఐ కాజా మోహినుద్దీన్, సిబ్బంది రాజు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో ఇద్దరు..

తిరుమలాయపాలెం: గంజాయిని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన నిందితులను శనివారం పోలీసులు కోర్టుకు రిమాండ్ చేశారు. మహారాష్ట్రకు చెందిన విష్ణువిఠల్‌రావు, సచిన్ కాంతా తోమ్రేలు రైళ్లలో వాటర్‌బాటిల్లు అమ్ముకుంటు జీవిస్తున్నారు. ఎక్కువ డబ్బు సంపాదిచాలన్నా ఆశతో గంజాయిని రవాణ చేసేందుకు పూనుకుటున్నారు. ఈనేపథ్యంలో చత్తీష్‌గడ్ నుంచి మహారాష్ట్రకు గంజాయి ప్యాకెట్లను తరలిస్తుండగా మండలంలోని సుబ్లేడు క్రాస్‌రోడ్డు వద్ద హోటల్‌లో అనుమానస్పదంగా ఉన్న వీరిని తిరుమలాయపాలెం ఎస్‌ఐ పట్టుకుని విచారించారు. దీంతో వారివద్ద నుంచి సుమారు 14కిలోల గంజాయిప్యాకెట్లను శుక్రవారం స్వాధీనం చేసుకుని శనివారం వారిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ వరాల శ్రీనివాస్ తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో గంజాయి పట్టివేత..

ఇల్లెందు, ఫిబ్రవరి 3: ఇల్లెందు మండలంలో ఎక్సైజ్ అధికారుల ఆదేశంతో శనివారం ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఎన్ఫోర్స్మెంట్ సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో ఇల్లెందులోని కరెంటు ఆఫీసు, బొజ్జాయిగూడెం వద్ద వాహనాలు తనిఖీలు చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పసి ప్రవీణ్, బర్మావత్ లోకేష్, ఖమ్మానికి చెందిన బొప్పన కిషోర్ అనే వ్యక్తుల వద్ద నుంచి 5.3కేజీల ఎండు గంజాయి, దిచక్రవాహనం, ఒక మోబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. విచారణలో నింధితులు ఆంధ్రా, ఒడిషా సరిహద్దులో గంజాయి కొనుగోలు చేసి అక్కడి నుంచి ఇల్లెందుకు ఎండు గంజాయిని తీసుకొచ్చి అక్కడ చిన్నచిన్న పొట్లాలు కట్టి విక్రయిస్తున్నట్టు తెలిపారన్నారు. పట్టుకొన్న గంజాయి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ అనిల్, సిబ్బంది కరీం, సుదీర్, హరీష్ పాల్గొన్నారు.


పట్టుబడిన నింధితులు, గంజాయి

చైన్ స్నాచింగ్‌కు విఫలయత్నం

నేలకొండపల్లి, ఫిబ్రవరి 3: మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లటానికి ఇరువురు వ్యక్తులు విఫలయత్నం చేసిన సంఘటన శనివారం సాయంత్రం మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొల్లినేని విజయమ్మ ముత్యాలమ్మ బజార్లో ఉన్న కూతురింటికి వెళ్లింది. కూతురు ఇంటి వద్ద నుంచి సీపీఎం కార్యాలయం సమీపంలోని తన ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి అనుసరిస్తున్న ఓ వ్యక్తి విజయమ్మ మెడలో ఉన్న బంగారు తాడు లాగటానికి ప్రయత్నించగా, గమనించిన విజయమ్మ కిందికి వంగటంతో బంగారుతాడు దొరకలేదు. విజయమ్మ కేకలు వేయటంతో సదరు వ్యక్తి పారిపోయాడు. గొలుసు లాగటానికి ప్రయత్నించిన వ్యక్తి గాక మరో వ్యక్తి వెనుక బండిపై అనుసరించినట్లు సమాచారం. ఇరువురు బండిపై ముజ్జుగూడెం రోడ్డు వైపు పారిపోయారని గ్రామస్థులు తెలిపారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

వైరా, ఫిబ్రవరి 3: మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో ఆరేళ్ల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన 70ఏళ్ల వృద్ధుడు చెరుకూరి లాలయ్యపై వైరా పోలీసులు శుక్రవారం రాత్రి ఫోక్సో కేసు నమోదుచేశారు. తమ ఇంటికి సమీపంలోని ఆరేళ్ల బాలికను ఇంట్లోకి పిలిచి లాలయ్య అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న సమయంలో వెంటనే అక్కడకు వెళ్లిన బాలిక తండ్రి కేకలు వేశాడు. తర్వాత పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు వైరా ఎస్‌ఐ మేడా ప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత దూషణలకు పాల్పడిన నలుగురిపై కేసు

కల్లూరు, ఫిబ్రవరి 3: కల్లూరులో ఓ వ్యక్తిపై ఇటీవల కాలంలో వ్యక్తిగత దూషణలకు పాల్పడిన ఘటనపై శనివారం నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షాకీర్ తెలిపారు. స్థానికంగా కె రామారావు అనే వ్యక్తిపై చంపుతామని బెదిరించి వ్యక్తిగత దూషణలకు పాల్పడిన ఘటనలో ఎం కృష్ణ, ఎన్ ప్రసాద్, బొల్లెపోగు కృష్ణ, యు రత్నంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్షకుని కష్టం దొంగల పాలు

●పొలం వద్ద కుప్పపోసిన పండుమిరపకాయలు చోరీ

తల్లాడ, ఫిబ్రవరి 3: ఆరుగాలం వ్యయప్రయాసలకోర్చి పండించిన పంట దొంగలపాలైంది. పొలంలో కోసి కుప్పపోసిన పండు మిరపకాయలను దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన శనివారం తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో చోటుచేసుకుంది. మల్లవరం గ్రామంలోని భద్రాచలం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పక్కన దాసరి శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన పొలంలోని సుమారు పది క్వింటాళ్ల పండుమిరపకాయలను దొంగలు ఎత్తుకెళ్లారు. వానాకాలం(ఖరీఫ్) సీజన్‌లో శ్రీనివాసరావు మూడున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చిని సాగుచేశాడు. కొన్నిరోజుల నుంచి పండు మిరప కాయలను కూలీలతో కోయించి పొలం వద్దనే కుప్పపోశాడు. ఇది గమనించిన దొంగలు పథకం ప్రకారం కుప్పలోని పది క్వింటాళ్లకుపైగా పండు మిరపకాయలను ఎత్తుకెళ్లి మిగిలిన సుమారు మూడు క్వింటాళ్ల పండు మిరపకాయలను వదిలివెళ్లారు. ఈమేరకు బాధిత రైతు శ్రీనివాసరావు తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

లైగింక వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 3: వివాహితపై లైంగిక దాడికి యత్నించిన ఘటనలో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేదాంతపురం గ్రామానికి చెందిన వివాహితపై గతనెల 29న రాత్రి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. దీనిపై బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ వివరించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న దృశ్యం

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి 3: ఖమ్మం నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురంలో రహదారిని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం కూల్చివేశారు. ప్రభుత్వస్థలా ల్లో నిర్మాణాలు చేపట్టినా, రహదారు లను ఆక్రమించి నిర్మాణాలు చేస్తే తొలుత నోటీసులు ఇస్తామని, అనంతరం వాటిని కూల్చివేస్తామని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. కాగా ఇటీవల కమిషనర్ టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి నగరంలో అక్రమ నిర్మాణాలను గుర్తించి, ఆక్రమణ దారులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఆ మేరకు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా శనివారం పాండురంగాపురంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

భార్య, కుమారుడి దాడిలో తండ్రి మృతి

●హత్యకేసు నమోదు చేసిన అశ్వారావుపేట పోలీసులు


అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 3: మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న ఓ వృద్ధుడు సొంతవారి చేతిలో హతమయ్యాడు. మద్యం మత్తులో భార్యపై దాడి చేస్తుండగా దాన్ని ప్రతిఘటిస్తూ భార్య, కుమారుడు చేసిన దాడిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. అశ్వారావుపేట మండలంలో శుక్రవారం జరిగిన ఈ ఘటనపై శనివారం రాత్రి పోలీసులు నమోదు చేశారు. అశ్వారావుపేటలో నివాసం ఉండే కోనా భద్రం(72) నిత్యం మద్యం తాగుతూ భార్య రాములమ్మపై దాడి చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. భర్త వేధింపులు తట్టుకోలేక రాములమ్మ మండలంలోని ఆసుపాక గ్రామంలో ఉండే కూతురు వద్దకు వెళ్లింది. అయితే భద్రం శుక్రవారం మధ్యాహ్నం అక్కడకు వెళ్లి భార్య రాములమ్మపై దాడికి దిగాడు. దీంతో అతడి కుమారుడు నరేశ్ తండ్రిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా భార్య, కుమారుడిపై భద్రం దాడి చేశాడు. దీంతో వారు ప్రతిదాడి చేయగా భద్రానికి తీవ్రంగా గాయాలయ్యాయి. దాంతో అశ్వారావుపేటలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అనంతరం భద్రం మృతదేహాన్ని ఆంధ్రాలోని వారి స్వస్థలమైన కొవ్వూరులో దహనం చేసేందుకు తీసుకెళుతుండగా బంధువులు మృతదేహాన్ని దర్శించుకునేందుకు అశ్వారావుపేటకు తీసుకురావాలని కోరారు. అశ్వారావుపేటకు తీసుకువచ్చిన భద్రం మృతదేహాన్ని పరిశీలించగా శరీరంపై గాయాలు కనిపించాయి. దీంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్యకేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ కేసును ఇన్‌చార్జ్ సీఐ కుమార్ విచారణ చేస్తున్నారు.

పిల్లలతో సహా గృహిణి అదృశ్యం

పాల్వంచ, ఫిబ్రవరి 3: పిల్లలతో సహా గృహిణి అదృశ్యమైన సంఘటన పాల్వంచ మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ప్రభాత్‌నగర్‌కు చెందిన మేకల సంధ్య తన భర్త నరేష్‌తో తరచూ విభేదించేది. ఈ క్రమంలోనే కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో తరచూ సంధ్యతో మాట్లాడుతుండేవాడు. ఈ విషయంలో పెద్ద మునుషుల సమక్షంలో పంచాయతీలో కూడా జరిగాయి. శుక్రవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటినుంచి వెళ్లిపోయింది. ఆమె భర్త నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

మనోవేధనతో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ, ఫిబ్రవరి 3: రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం పట్టణ పరిధిలోని శేఖరం బంజరకు చెందిన జర్పుల మంగ్యా (55) స్థానికంగా కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందులో ఒక కుమార్తె పెళ్లి అయినప్పటికీ భర్త నుంచి విడపోయి ఇంటివద్దనే ఉంటుంది. ఒక్క కొడుకు పుట్టు మూగ, చెవిటి వాడు కావడంతో మానసికంగా కృంగి పోయాడు. ఈ క్రమంలోనే అతను మద్యానికి బానిసైయ్యాడు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు అతిగా మద్యం సేంచాడు. రాత్రి 10 గంటలకు అందరితోపాటు ఇంట్లో నిదురించాడు. కానీ అర్ధరాత్రి కుటుంబ సభ్యులు చూసేసరికి మంచంపై లేక పోవడంతో వారికి అనుమానం వచ్చింది. ఇంతలో దగ్గరలోని గాజులగూడెం రైల్వే పట్టాలపై పడి మంగ్యా మృతి చెందాడని స్థానికులు ఫోన్‌లో సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు మంగ్యా మృతదేహం గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ద్వాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ బానాల రాము తెలిపారు.


మంగ్యా (ఫైల్)

ఊరికి ఉపకారి

» రూ.కోటి సొంత నిధులతో గ్రామాభివృద్ధి
» వేలాది మొక్కలతో వెల్లివిరుస్తున్న హరిత శోభ
» ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దేవతామూర్తుల విగ్రహాలు
» ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తున్న రామానుజవరం తాజా మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి

తల్లాడ, ఫిబ్రవరి 3: అవనికి పచ్చని కోక చుట్టినట్టు ఉండే చెట్లు.. శాంతిని బోధిస్తున్నట్టుగా ఉండే చెరువు మధ్యలో బుద్ధుడు.. అభయమిస్తున్నట్టుగా ఉండే అంజనేయుడు.. జ్ఞాన ముద్రలో శివుడు.. పరిశుభ్రతకు ఆలవాలంగా వీధులు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ఐదేళ్లల్లో ఆ ఊరు చాలా మారింది. ఇంతటి మార్పు వెనుక ఉన్నది ఆ ఊరి తాజా మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి. తల్లాడ మండలంలో మారుమూల రామానుజవరాన్ని పూర్తిగా మార్చేశారు. ప్రభుత్వ నిధులే కాకుండా సొంతంగా కోటి రూపాయలు వెచ్చించి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

● 2019లో రామానుజవరం సర్పంచ్‌గా శీలం కోటారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలిగా, తల్లాడ వైస్‌ఎంపీపీగా కోటారెడ్డి సతీమణి శీలం శివపార్వతీ పదవీ బాధ్యతలు చేపట్టారు. తమను ఎన్నుకున్న ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా గ్రామాభివృద్ధికి కృషిని కొనసాగించారు. సుమారు రూ.కోటి సొంత నిధులతో రామానుజవరం గ్రామాభివృద్ధికి కుటుంబసభ్యుల సహకారంతో కోటారెడ్డి శ్రీకారం చుట్టారు. 24 గుంటల విస్తీర్ణం గల సొంత స్థలంలో పల్లెప్రకృతివనం ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన శీలం సీతారామిరెడ్డి కుమారులు వెంకటరెడ్డి, బ్ర హ్మారెడ్డి, శీలం గోపిరెడ్డి కుమారుడు కోటారెడ్డిలను పది కుంటల స్థలం దానిమి చ్చేలా ఒప్పించి ఆస్థలాన్ని వైకుంఠధామానికి కేటాయించారు. ఆరు అడుగులకు పైగా లోతున్న ఈ స్థలాన్ని మట్టితో పూడ్చి అభివృద్ధి చేశారు. దీంతోపాటు గ్రామంలో లోతైన స్థలాలన్నింటికీ 12వేల ట్రక్కులకుపైగా మట్టిని తోలి చదును చేశారు. గ్రామంలో ఇంకుడుగుంతలు నిర్మించారు.


పదికిలోమీటర్ల మేర మొక్కల పెంపకం

పల్లెప్రకృతి వనం వివిధ ప్రాంతాల్లో పది కిలోమీటర్ల మేరకు స్వచ్ఛమైన ప్రాణవాయువు ఫలాలనిచ్చే పండ్లు, పూలు, ఔషధ, సుగంధ, అలంకరణ మొక్కల పెంపకం చేపట్టారు. కడియం నర్సరీ నుంచి రూ.500నుంచి రూ.5వేల వరకు విలువైన, నాణ్యమైన 2వేల నేరేడు, 24రకాల 1200మామిడి, 900కొబ్బరి మొక్కలతోపాటు జామ, సపోట, దానిమ్మ, రామఫలం, లక్ష్మణఫలం, సీతాఫలం, జబ్బూవలం, పనస, రేగు, సదాపనసా, తీపిచింత, ఉసిరి, కర్జూరం, అనాస, జీడిమామిడి, గులాబీ, సీతమ్మవారి జాడబంతి, రాజహంస, మల్లె, వైలెట్, కాగిత, గన్నేరు, కోడిజుట్టు, కొల్లివిత్తులు, ఉదానీ, స్పైసీజట్రేపా, అలమంద, బంగారుబాకా, క్యాసియం, మనీప్లాంట్, ప్రోటాన్, తులసీ, కలబంద, తమలపాకు, యాలకులు, లవంగా, దాల్చినచెక్క, బిర్యానీ ఆకు, వేప, మందారం, గానుగ రకాలకు వేలాది మొక్కలు నాటారు. వాటి సంరక్షణ కోసం సపోర్టు కర్రలు, పెన్సింగ్‌లను ఏర్పాటుచేశారు. కొన్నిచోట్ల మొక్కలు చనిపోతే వాటి స్థానంలో ఎప్పటికప్పుడు తిరిగి మొక్కలు నాటుతున్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి...

రామానుజవరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు సర్పంచ్ కోటా రెడ్డి నడుంబిగించారు. స్థానిక వైకుంఠధామం సమీపంలో రూ.18లక్షల వ్యయంతో 30 అడుగుల ఎత్తైన శివుడు, నల్లచెరువు కట్ట వద్ద రూ.16 లక్షలతో 32అడుగుల ఆంజనేయుడు, చెరువు మధ్యలో రూ.9లక్షలతో - 18అడుగుల బుద్ధుడు విగ్రహాలు ఏర్పాటు చేశారు. వైకుంఠధామంలో రూ.50వేలతో ఆరు అడుగుల కాటికాపర విగ్రహాలను నెలకొల్పారు. చెరువు మధ్యలో బుద్ధుడి విగ్రహం వద్దకు వెళ్లేందుకు వీలుగా సిమెంట్ పిల్లర్లతో రోప్‌వే నిర్మాణాన్ని చేపట్టారు. . వైకుంఠధామం ప్రాంగ ణంలో అలంకరణ పూలమొక్కలు పెంచి స్వర్గధా మంగా తీర్చిదిద్దారు. వైకుంఠ ధామం, పల్లెప్రకృతి వనం వద్ద సిమెంట్‌తో ఆర్చీలను నిర్మించారు. పది అడుగుల పొడవు, ఐదు -అడుగుల వెడల్పుతో ఐలవ్యూ రామానుజవరం అనే హోర్డింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.


మొక్కలతో శోభాయమానంగా పల్లెప్రకృతి వనం



“ పుట్టిన ఊరు రుణం తీర్చుకొనేందుకే...
శీలం కోటారెడ్డి,
తాజా మాజీ సర్పంచ్, రామానుజవరం

పుట్టిపెరిగిన ఊరు రుణం తీర్చు కొనేందుకే ఎంత ఖర్చయినా వెనుకాడకుండా గ్రామాభివృద్ధి పనులు చేపట్టాం. భవిష్యత్‌తరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు, ప్రగతి ఫలాలను అందిం చేందుకు వేలాదిగా పండ్లు, పూలు, ఔషధ, సుగంధ, అలంకరణ మొక్కలను పెంచుతున్నాం, మారుమూల గ్రామంగా ఉన్న రామానుజవరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనేదే మా సంకల్పం. పదవులు తాత్కాలికమైనప్పటికీ చేసిన అభివృద్ధి చిర స్థాయిగా నిల్చిపోవాలనే ఉద్దేశ్యంతో గ్రామాభి వృద్ధికి కృషి చేస్తున్నాం. ”


మొక్క నాటుతున్న కోటారెడ్డి దంపతులు


ఆకర్షణీయంగా స్వాగత ద్వారం


ఊర చెరువు మధ్యలో ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహం


ఆహ్లాదంగా శ్మశాన వాటిక పరిసరాలు

అధికారుల అలసత్వానికి పరాకాష్ట

» పదవీకాలం ముగిశాక చెక్‌పవర్ పునరుద్ధరిస్తూ ఉత్తర్వుల జారీ
» ఆశ్చర్యపోయిన వెంకటాపురం ఉపసర్పంచ్ » అధికారుల తీరుపై ఆగ్రహం

వేంసూరు, ఫిబ్రవరి 3: అధికారుల అలసత్వానికి నిలువెత్తు పరాకాష్ట ఇది. పదవీ కాలం ముగిసిన తర్వాత ఉపసర్పం చ్‌కు చెక్ పవర్ ఇచ్చి తమ ఘనతను చాటుకున్న తీరు ఇది. వేంసూరు మండలం వెంకటాపురం ఉపస ర్పంచ్ ఎర్రసాని కృష్ణకుమారి చెక్ పవర్‌ను వివిధ కారణాలతో 2020లో రద్దుచేశారు. ఉపసర్పంచ్, వార్డుస భ్యుల విన్న పాలతో గతనెల 30న ఉప సర్పంచ్‌కు చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశా రు. ఈ ఉత్తర్వులు పంచాయతీల పదవీ కాలం ముగిసిన తర్వాత రెండోరోజు తీరిగ్గా పోస్టులో వచ్చిందని ఉప సర్పంచ్ కృష్ణకుమారి ఆరోపించారు. అంతే కాదు పోస్టులో ఆ ఉత్తర్వులు ఆశ్చర్యపోవడం తనవంతయింద న్నారు. శనివారం వెంకటాపురంలో జరిగిన విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ ప దవీకాలం ముగిసే నాటికి అధికారులు ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. గత బీఆర్ ఎస్ హయాంలో అధికారులు తొత్తులుగా వ్యవహరించి పదవీ కాలం ముగిసే సమయానికి చెక్ పవర్ పునరుద్ధరి స్తూ ఉత్తర్వు లు జారీ చేయించారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పుచ్చకా యల సోమిరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తాజా మాజీ ఉపసర్పంచ్, వార్డుసభ్యులు

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం ఫిబ్రవరి 3: జమలాపురం దివ్యక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామికి ఆలయంలో శనివారం సర్వాంగా భిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తె ల్లవారుజా మునే ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీవారికి సుప్రభాసేవ నిర్వహించి, పంచామృతాలతో, సుగంధ ద్ర వ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. ప్రతిష్టాస్వామికి నూతన ప ట్టువస్త్రాలు ధరింపజేసి భక్తులకు దర్శనం కలిగించారు. అలివేలుమంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపు చేసి పరిణయ వేదికక వద్దకు చేర్చి వైభవంగా నిత్యకళ్యాణాన్ని నిరహిం చారు. శనివారం కావటంతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పొంగళ్లను నివేందించారు. భక్తులు శ్రీవారితో పాటు అన్ని ఉప ఆలయాల్లో పూజలు నిర్వహించి యాత్రను సఫలం చేసుకున్నారు. దేవస్థాన అధికా రులు దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, ఉచిత అన్నదాన విత రణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ సూపరింటెం డెంట్ విజయకుమారి, సోమయ్య, కృష్ణప్రసాద్, సాయి, వంశీ, బాణావత్ విజయ్, మారుతీరావు పాల్గొన్నారు.


పొంగళ్లతో ఆలయం చుట్టూ భక్తుల ప్రదక్షిణలు

దేశంలో తెలంగాణ అగ్రగామి

» ఆ ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే » మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
» కార్యకర్తలతో కొత్తగూడెం నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం

కొత్తగూడెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం భద్రాద్రి జిల్లా తెలంగాణ భవన్‌లో నిర్వ హించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. విలేక రులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని, ఓటమి తాత్కాలికమని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రెండు సార్లు కేసీఆర్ సారథ్యంలో పేదలకు ఎన్నో సంక్షేమ ఫలాలను అందిం చి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేశామన్నారు. అనంతరం ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు కేంద్రం ప్రకటించిన విభజన హామీల అమలుకై పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఘనత కేవలం బీఆర్‌ఎస్ ఎంపీలకే దక్కిందన్నారు. రాబోయే రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపించుకొని కేసీఆర్‌కు మద్దతుగా నిలుద్దామని స్పష్టం చేశారు. సమావేశంలో భద్రాద్రి జడ్పీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ(చిన్ని), ఎడవల్లి కృష్ణ పాల్గొన్నారు.

వనమా రాఘవేంద్రరావుపై భారత రాష్ట్ర సమితి విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ కార్యకర్తలు శనివారం ఆందోళన చేశారు. సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా కేసీఆర్‌కు జడ్పీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేసి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి అందజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 3: జనవిజ్ఞాన వేదిక ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిక్కా బజా ర్‌లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాలను నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి మొత్తం 240 మంది విద్యార్థులు పోటీల్లో పా ల్గొన్నారు. జిల్లాస్థాయిలో విజేతలకు జిల్లా సైన్స్ అధికారి బహుమతులను అందించారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం విభాగంలో, జడ్పీహెచ్‌ఎస్ తనికెళ్ల, తెలుగు మీడియం విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ జక్కేపల్లి, ప్రైవేటు పాఠశాలల విభాగంలో శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ మీనవోలు ప్రథమ స్థానం సాధించాయి. ఈ విద్యార్థులు ఫిబ్రవరి 9, 10, 11న జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.శివ న్నారాయణ, కె.రామారావు, కన్వీనర్ మోహన్ ఎల్వీ రెడ్డి శ్రీరాములు సీతారా ములు రామకృష్ణ.శర్మ, రామకృష్ణ రాఘవయ్య, రమేష్, భాస్కర్ రెడ్డి, గురవ మ్మ, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, కనకయ్య, నాగేశ్వరరావు, ఉపేంద్ర, పలువురు ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఐఏఎల్ న్యాయవాదులు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 3: శనివారం ఖమ్మానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్ ను న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. నగేష్‌ను కలిసిన వారిలో ఐఏఎల్ నాయకులు పెమ్మసాని పట్టాభి, షేక్ లతీఫ్, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు ఉన్నారు.


నగేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

భళా.. జాబ్‌మేళా

1,122 మందికి నియామక లేఖలు

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 3: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, టీఎస్ స్టెప్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాకు జిల్లా వ్యాప్తంగా సుమారు 11,530 మంది నిరుద్యోగులు హాజరై తమ దరఖాస్తులను (రేజ్యూమ్స్) అందజేశారు. శుక్రవారం సాయంత్రం వరకు సుమారు 7,500 మంది నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా మరికొంత మంది అభ్యర్థులు శనివారం నేరుగా జాబ్‌మేళా ప్రాంగణంలో తమ పేర్లను నమోదు చేసుకొని సంబంధిత కంపెనీల కౌంటర్లలో దరఖాస్తులను అందించారు. ఈ మేళాలో సుమారు 65 కంపెనీలకు చెందిన కౌంటర్లు ఏర్పాటు చేయగా నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో కౌంటర్ల వద్ద రద్దీ ఏర్పడింది. ఉదయం 11 గంటల సమ యంలో ఒక్కసారిగా యువతీ యువకులు ఎగబడడంతో కొంత తోపులాట జరిగింది. అంతకుముందు కలెక్టర్ వీపీ. గౌతమ్ జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్‌మేళాను ప్రారం భించారు.

చిన్న ఉద్యోగమని చింతించవద్దు: కలెక్టర్ గౌతమ్

జాబ్‌మేళాలో వచ్చేది చిన్న ఉద్యోగమని చింతించకుండా ఉద్యోగంలో వెంటనే చేరాలని కలెక్టర్ వీపీ. గౌతమ్ పేర్కొన్నారు. జాబ్‌మేళాను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగం పొందడాన్ని మొదటి అడుగుగా భావించి తక్షణమే ఉద్యోగ జీవితంలోకి అడుగు పెట్టాలని ఆకాంక్షించారు. ఒకసారి ఉద్యోగంలో చేరితే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమయ్యేవారు ఈ ఉద్యోగాలు చేస్తూ వారి ప్రిపరేషన్ కొనసాగించవచ్చన్నారు. ప్రస్తుతం ఖమ్మంలోని జాబ్‌మేళాలో సుమారు 500 ఉద్యోగాలు నెలకు రూ.45వేల నుంచి రూ.50 వేల వరకు జీతం లభించేవని, సుమారు 3 వేల ఉద్యోగాలు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు జీతం లభించేవిగా ఉన్నాయన్నారు. అతేకాకుండా ఈ సారి సుమారు 5వేల ఉద్యోగాల భర్తీ కోసం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో ఉద్యోగాల కోసం యువతులు భారీగా రావడం ఆనందంగా ఉందన్నారు. అమ్మాయిల వల్ల అబ్బాయిలకు కొంత కాంపిటేషన్ ఉంటుందని యువకులు మరికొంత కష్టపడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని వదులుకోవద్దని కలెక్టర్ నిరుద్యోగులకు సూచించారు.

1,122 మందికి నియామక లేఖలు

నగరంలో నిర్వహించిన జాబ్‌మేళాలలో 11,530 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా వారిలో సుమారు 1,122 మందికి వెంటనే పలు కంపెనీలు నియామక లేఖలు అందిం చాయి. అంతే కాకుండా సుమారు 2,698 మందిని సదరు కంపెనీలలో నిర్వహించే ఫైనల్ ఇంట ర్వ్యూలకు ఎంపిక చేశారు. జాబ్‌మేళాను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్, టీఎస్ స్టెప్ రాష్ట్ర మేనేజర్ జనార్ధన్ తదితరులు సమీక్షించారు.




జాబ్ మేళాను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్, హాజరైన అభ్యర్థులు, జాబ్ మేళాకు హాజరైన బాలింతలు, వారి పిల్లలను ఊరడిస్తున్న సహాయకులు

నేనే.. కాదు నేనే..

» రసకందాయంలో డీసీఎంఎస్ ఛైర్మన్ పదవి » రాయల వర్సెస్ కొత్వాల పునరావృతం
» ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాలతో మళ్లీ అయోమయం

ఖమ్మం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొన్నటి దాకా ఒకరు పదవిలో ఉన్నారు. వివాదాల నేపథ్యంలో ఆయన పదవి కోల్పోయారు.. ఆయన స్థానంలో మరో వ్యక్తి పదవిలోకి వచ్చారు.. అంతా బాగుంది అనుకుంటున్న తరుణంలో పదవి కోల్పోయిన వ్యక్తి మళ్లీ తెరపైకి వచ్చారు.. తనపై అనర్హతను కొట్టేశారంటూ ప్రకటించారు. చదువు తుంటే సినిమా స్టోరీలాగా ఉంది కదూ.. ప్రస్తుతం డీసీ ఎంఎస్‌లో జరుగుతోంది ఇదే!

ఖమ్మం డీసీఎంఎస్ (డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) ఛైర్మన్ వ్యవహారం రకరకాల మలుపులు తిరుగుతోంది. వరంగల్ సహకారశాఖ ట్రిబ్యునల్ కోర్టు డీసీ వో ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసిందని, తాను యథాస్థితిగా మళ్లీ ఛైర్మన్‌గానే ఉన్నాని రాయల శేషగిరిరావు చెబుతున్నారు. డీసీఎంఎస్ కార్యాలయానికి వచ్చి ఛైర్మన్ సీటులో ఆసీ నులయ్యారు. అయితే డీసీవో ఆదేశాలతో వైస్ ఛైర్మన్‌గా ఉన్న తాను డీసీఎంఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నాని, హైకోర్టులో కేసు నడుస్తోందని, ట్రిబ్యునల్ కోర్టులో రాయల తప్పుడు స మాచారం ఇచ్చారని కొత్వాల శ్రీనివాసరావు అంటున్నారు. ఈ ఇద్దరి మధ్య పదవి పోరుతో ఖమ్మం డీసీ ఎంఎస్ ఛైర్మన్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కొత్వాల శ్రీనివాసరావు ఛైర్మన్‌గా కొనసా గుతున్నారని, ట్రిబ్యు నల్ ఎదుట తాను ఏడున సమాధా నం ఇవ్వాల్సి ఉంటుందని, పూర్తిస్థాయి తీర్పు వచ్చిన తర్వాతే తదుపరి ఆదేశాలుంటాయని డీసీవో విజయకుమారి పేర్కొంటున్నారు.

ట్రిబ్యునల్‌కు, హైకోర్టుకు వెళ్లిన వ్యవహారం

తాను ఆసుపత్రిలో చికిత్సలో ఉండగా నోటీసులు జారీ చేశారని, మొత్తం బకా యిలు చెల్లించి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకుని డీసీసీబీతో పాటు డీసీవో కు ఇతర అధికారులకు తెలియచే శాననని రాయల శేషగిరిరావు పేర్కొంటున్నారు. అయినప్పటికీ గత నెల 23న తనను డిఫాల్టర్‌గా పే ర్కొంటూ డైరెక్టర్ అనర్హత వేటు వేస్తూ డీసీవో ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనిపై సవాల్ చేస్తూ వరంగల్ ట్రిబ్యు నల్‌కు వెళ్లగా డీసీవో ఆదేశాలను నిలిపివేశారన్నారు. దీంతో గతంలో ఉన్న యథాతథ స్థితిలో గంగదేవిపాడు సొసైటీ డైరెక్టర్‌గా, ఖమ్మం డీసీఎంఎస్ ఛైర్మన్‌గా విధుల్లో కొనసాగుతున్నానని ఆయన తెలిపారు.

కుర్చీలో కూర్చోవడం చట్టవ్యతిరేకం

రాయల శేషగిరిరావు ఛైర్మన్ కుర్చీలో కూర్చోవడం సహకార చట్టాలకు వ్యతిరేకమని కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ బ్యాంకు డిఫాల్టర్‌గా ఉండి శేషగిరిరావు పదవి కోల్పోయారని, దీనిపై హైకోర్టులో కేసు ఉండగా ట్రిబ్యునల్‌కు వెళ్లడం హైకోర్టు ధిక్కారమని, కొత్వాల పేర్కొ న్నారు. కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి డీసీఎంఎస్ వైస్‌ఛైర్మన్‌గా ఉన్న తనను గంగదేవి పాడు సొసైటీ వైస్ ఛైర్మన్‌గా పేర్కొన్నారని కొత్వాల ఆరోపించారు.

“ ట్రిబ్యునల్ ఆదేశాలు సంతృప్తికరంగా లేవు
డీసీవో విజయకుమారి వెల్లడి

ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు సంతృప్తికరంగా లేవు. అది పూర్తిస్థాయి తీర్పుకాదు. ఈనెల 7న ట్రిబ్యునల్‌కు తెలియచేస్తాం. పూర్తి తీర్పువచ్చేవరకు డీసీఎంఎస్ ఛైర్మన్‌గా కొత్వాల శ్రీనివాసరావు కొనసాగుతారు. తదుపరి ఆదేశాలను బట్టి నిర్ణయం వెల్లడిస్తామని విజయకుమారి పేర్కొన్నారు. ”

నర్సరీలో మొక్కల ధ్వంసం: కేసు నమోదు

కారేపల్లి, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని రేలకాయలపల్లి తవిసిబోడులో ప్రభుత్వనర్సరీలో శనివారం కొందరు మొక్కలు ధ్వంసం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎస్‌ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. తవిసిబోడు మాజీ సర్పంచ్ భూక్యా రమణ, అతడి కుటంబసభ్యులు సుధాకర్, సునీత నర్సరీలో రూ. రెండు లక్షల విలువైన మొక్కలు ధ్వంసం చేశారు. నాలుగు సంవత్సరాల నుంచి ఇక్కడ మొక్కలు పెంచుతు న్నారు. నర్సరీ ఉన్న స్థలం మా భూమి అని మాజీ సర్పంచ్ రమణ, సుధాకర్, సునీత మొక్కలును ధ్వంసం చేశారు. నర్సరీకి చుట్టూ ఉన్న కంచెను కూడా ధ్వంసం చేశారు. ఇదే విషయంపై ఫీల్డ్ అసిస్టెంట్ ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

వృద్ధురాలు పోగొట్టుకున్న పర్సు అందజేత

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి3: రోడ్డుపై ఓ వృద్ధురాలు పోగోట్టుకున్న నగదు పర్సును కుటుంబ సభ్యులకు అందించి ఓ హోంగార్డు మానవత్వం చాటుకున్నాడు. నగరంలోని చెరువుబజార్‌కు చెందిన హైమావతి అనే వృద్ధురాలు పనిపై ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఈనేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో జడ్పీసెంటర్ వద్ద తనచేతిలో ఉన్న పర్సును రోడ్డుపై పోగొట్టుకుని వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత ఆ ప్రాంతంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోంగార్డు దామెర రవి రోడ్డుపై ఉన్న పర్సు గమనించి అక్కడికి వెళ్లాడు. అనంతరం దానిని పరిశీలించగా దానిలో విలువైన డాక్యుమెట్లతోపాటు కొంత నగదు ఉంది. దీంతో ఆ పర్సులో ఉన్న ఓ నెంబర్ ఆధారంగా వృద్ధురాలి కుటుంబ సభ్యులకు పర్సును అందించారు ఈసందర్భంగా పలువురు సిబ్బంది హోంగార్డు రవిని అభినందించారు.


వృద్ధురాలి బంధువుకు పర్సు అందజేస్తున్న హోంగార్డు

కాంగ్రెస్‌లోకి సొసైటీ డైరెక్టర్లు

నేలకొండపల్లి, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని రాజారాంపేట సొసైటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు డైరెక్టర్లు శనివారం సాయంత్రం పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. డైరెక్టర్లు చిర్రా జయరాజు, ఎండీ.దిలావర్‌ఖాన్, బొల్లా యాలాద్రి కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ దీరావత్ బాలాజీ, కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది ఆకుల శేఖర్, కనమర్లపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు గురుకుల కళాశాలలో సీవో ప్రవేశ పరీక్ష

కల్లూరు, ఫిబ్రవరి 3: కల్లూరులోని గురుకుల బాలికల కళాశాలలో ఆది వారం సీవో కళాశాలల్లో ప్రవేశానికి గానూ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత శనివారం తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు సంబంధిత వెబ్ సైట్ నందు హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకొని ఆదివారం ఉదయం 9 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సి పాల్ కోరారు. పరీక్ష ఉదయం 10 గంటటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని ఆమె వివరించారు.

జాతీయ స్థాయి పుస్తక సమీక్షలో సాత్విక్‌కు బహుమతి



అశ్వారావుపేట, ఫిబ్రవరి 3: అశ్వారావుపేటకు చెందిన బాల కథకుడు సాత్విక్ సాయి కుమార్‌కు ఉరిమళ్ల ఫౌండేషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్ష పోటీలలో బహుమతి లభించింది. ఈ మేరకు శనివారం ఉరిమళ్ల ఫౌండేషన్ నిర్వాహకులు బోగోజు ఉపేంద్ర, ఉరిమళ్ల సునంద సాత్విక్‌కు సమాచారం అందజేసారు. అమ్మిన శ్రీనివాసరాజు రాసిన చంద్రవంకలు అనే బాలల కథా సంపుటిపై సమీక్ష రాసి సాత్విక్ పోటీలకు పంపారు. జాతీయస్థాయిలో జరిగిన ఈ పోటీలలో 200పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో 34 ఉత్తమ సమీక్షలను ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎంపిక చేసిన దానిలో సాత్విక్ ఉన్నారు. సాత్విక్ 9వ తరగతి చదువుతున్నాడు. త్వరలో నిర్వహించబోయే బహుమతి ప్రదానోత్సవ సభలో బహుమతిని అందించనున్నట్టు తెలిపారు. సాత్విక్‌కు బహుమతి లభించడంపట్ల ఎంఈవో కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు.

'ఎంపీ' విజయమే లక్ష్యంగా పనిచేయండి

ముచ్చటగా మూడోసారి విజయం దక్కించుకోవాలి

సంక్షేమాలను దూరం చేస్తూ కాంగ్రెస్ మార్పు తెచ్చింది

అధైర్యపడొద్దు.. 30 మంది అండగా ఉంటాం

పినపాక సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీష్ రావు

మణుగూరు, ఫిబ్రవరి 3: పినపాకలో దురదృష్టవశాత్తూ ఓడిపోయాం.. ఉత్సాహాన్ని నింపుదామని వస్తే మీరే నాకు ఉత్సాహాన్ని నింపారు.. ఇప్పుడు ఎంపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. ఓ ధైర్యం దొరకుతుంది. ఓ ప్రొటోకాల్ దొరుకుతుంది. ఖమ్మంలో ఎమ్మెల్యేలు పోయినా ఎంపీగా నామ అద్భుతంగా గెలిచారు. మీరు పట్టుబడితే మహబూబాబాద్ గెలిపించుకుందామని, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. అందరమూ కష్టపడి మూడోసారి ముచ్చటగా గెలిపించుకుందామని అన్నారు. శనివారం మణుగూరు పట్టణంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ స్థాయి, నాయకులు, కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. నాయకులకు కార్యకర్తలకు దిశ నిర్దేశాన్ని చేశారు. ప్రజల్లో చర్చ మొదలైంది.. మార్పు తెస్తాం మార్పు తెస్తామన్నారు. కాంగ్రెస్ ఏం మార్పు తెచ్చింది.. ఉన్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా కోతలతో మార్పులను తెచ్చిందన్నారు. నాడు 24 గంటలు కరెంటు ఉండేది.. ఇప్పుడు 16 గంటలకు వచ్చింది. కరెంటు కోతలు నాడు లేవు ఇప్పుడు ట్రిప్‌లతో కోతలు మొదలయ్యాయన్నారు. ఆనాడు పెన్షన్ దారులకు 20 వతేది వరకు పెన్షన్లు అందరికీ అందేవీ కానీ జనవరిలో పెన్షన్ నేటికీ రాలేదన్నారు. ఆరు లక్షల మంది ఎదురు చూస్తున్నారు. ఆర్థికశాఖ మంత్రి జిల్లాలో ఉన్నా పెన్షన్ మాత్రం రాలేదన్నారు. ఉచిత బస్సులను పెడితే పెట్టారు. ఆటో కార్మికులను రోడ్డున పడేసే మార్పును కాంగ్రెస్ తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. 12మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా ఉంటే ఆటో కార్మికులకు నెలకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులకు కళ్లు నెత్తికెక్కాయి. అహంకారంతో మాట్లాడుతున్నారు... జడ్పీ చైర్మన్ రైతు బంధు డబ్బులు పడలేదని అంటే పోలీసులతో గెంటించే ప్రయత్నం చేస్తే... చెప్పుతో కొట్టండని ఓ మంత్రి మాట్లాడుతాడు.. ఇది అహంకారం కాదా... రైతుబంధు డిసెంబర్‌లో ఇచ్చి రైతులను ఆదుకున్నాడు నాటి సీఎం కేసీఆర్.. ఏ భూములకూ రైతుబంధు రావడం లేదన్నారు. నాటి ప్రభుత్వ పథకాలను ప్రజలకు సజావుగా అందించలేని మార్పును కాంగ్రెస్ తీసుకొచ్చిందని విమర్శించారు. రెండు నెలలు కాలేదు ప్రాజెక్టులను ఢిల్లీకి అప్పగించిన ఘనతను కాంగ్రెస్ సాధించిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన హామీని భట్టి విక్రమార్క ఆసెంబ్లీ సాక్షిగా వచ్చి అబద్ధం ఆడుతూ దాటవేశారని ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలు ఎలాంటి ఇబ్బందీ పడాల్సిన అవసరం లేదని, 30 మంది ఎమ్మెల్యేలు అవసరమైతే బస్సు వేసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఎంపీని గెలిపించుకుంటా అనే కసి పినపాక ఎమ్మెల్యే రేగాలో కనిపిస్తోందని, రేగాకు సభాముఖంగా కితాబిచ్చారు. అనంతరం ఎంపీ కవిత మాట్లాడుతూ.. జరగబోయే ఎంపీ ఎన్నికల్లో తానే అభ్యర్థిగా నిలబడబోతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో తన వంతు పాత్రను వివరించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, సీనియర్ నేత కోలేటి భవానీ శంకర్ నియోజకవర్గ మండల కమిటీల బాధ్యులు మాట్లాడారు.

పంచాక్షరయ్యను కలిసిన హరీష్ రావు

బూర్గంపాడు: తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్ట్ అధ్యక్షుడు తాళ్లూరి పంచాక్షరయ్యను మాజీ మంత్రి, సిద్ధిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. మండలంలోని ఇరవెండి గ్రామంలోని పంచాక్షరయ్య నివాసానికి వెళ్లి ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

సామాజిక స్పృహతోనే విద్యార్థుల్లో ప్రతిభ



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరచారి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 3: సామాజిక స్పృహతోనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చునని భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి అన్నారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో తెలంగాణ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం భద్రాద్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభ పాటవ పరీక్ష ముగింపు వేడుకలకు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల్లో ఉన్న ప్రావీణ్యాన్ని గుర్తించేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సమాజం పట్ల విద్యార్థి దశలోనే సామాజిక స్పృహకలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత శిఖరాలను చేరాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ప్రధానోపాధ్యాయులు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతుల అభివృద్ధికి కృషి



గిరిజన రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాదరావు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 3: జేవీఆర్ ట్రస్ట్ ద్వారా గిరిజన ప్రాంతాల్లో కరెంటు, బోర్లు లేని రైతులు వ్యవసాయం చేసుకునేలా ఉచితంగా మోటార్లు ఏర్పాటు చేసి సాగునీరు పుష్కలంగా అందేలా నిరంతరం కృషిచేస్తున్నట్లు మాజీ మంత్రి జలగం ప్రసాదరావు అన్నారు. మండలంలోని బిల్లుడుగూడెం గ్రామంలో శుక్రవారం మాజీ మంత్రి జలగం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఇప్పటికే మండలంలోని అనేక గ్రామాల్లో ట్రస్ట్ ద్వారా మోటార్లు, కరెంటు లైన్లు ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో గిరిజన రైతులకు మోటార్లు అందించేందుకు రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. గిరిజన రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడకుండా ఉండకూడదని తెలిపారు. లైన్ల ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి లైన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ ఏడీఈ వెంకటేశ్వర్లుకు సూచించారు.

చెట్లను చూస్తే సంతోషంగా ఉంది



తాను నాటిన మొక్క (నేడు చెట్టు) వద్ద వైవీ గణేష్

చర్ల, ఫిబ్రవరి 3: పర్యావణ పరిరక్షణ కమిటీ పేరుతో 2004 సంతవత్సరంలో నేను నాటిన మొక్కలు నేడు చెట్లుగా పెరిగాయని, వీటిని చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని హన్మంకొండ డిప్యూటీ కలెక్టర్ వైవీ గణేష్ అన్నారు. శనివారం ఆయన చర్ల మండలంలో పర్యటించి చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2004 సంవత్సరంలో తహసీల్దార్‌గా పని చేస్తూ, మండల కేంద్రంలో సుమారు 350 ట్రీగార్డులు తయారీ చేసి మొక్కలు నాటామని, మండల వ్యాప్తంగా సుమారు 4000 వేల మొక్కలు నాటామని గుర్తు చేశారు. నేడు 70 శాతం మొక్కలు చెట్లుగా పెరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, మండల ప్రజలు ఎంతో సహకారం అందించారని తెలిపారు. నేడు ఆ మొక్కలు నేడు ఎంతో మందికి నీడను, పూలను, ఫలాలను అందిస్తున్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు.

బీటీపీఎస్ సీఈకి సమ్మె నోటీసు



సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 3: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ సీఈ బిచ్చన్నకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బాధ్యులు సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ.. విభిన్న రంగాల్లో పనిచేస్తోన్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ కంపెనీల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీసం వేతనం జీఓను అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మె జయప్రదం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దడిగల సత్యనారాయణ, కృష్ణ, రవి, రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచెయ్యి



సమావేశంలో మాట్లాడుతున్న పవన్

అశ్వాపురం, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచెయ్యి చూపిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పవన్‌సాయి విమర్శించారు. శనివారం అశ్వాపురంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి పదిశాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.6 శాతం కేటాయించారన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తామంటూనే కేంద్రం నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యను ధ్వంసం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రభుత్వ చర్యలను విద్యార్థులు తిప్పి కొట్టాలన్నారు. ఇందుకోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మండల ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, నాయకులు వెంకట్, రాజు, విజయ్, రాము పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 3: అన్నపురెడ్డిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదచార్యులు సంప్రదాయ రీతిలో పూజలు, అర్చనలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణం తిలకించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణ అందరి బాధ్యత: సీఐ



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

టేకులపల్లి, ఫిబ్రవరి 3: రోడ్డు ప్రమాదాల నియంత్రణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని టేకులపల్లి సీఐ ఇంద్రాసేనారెడ్డి కోరారు. రోడ్డు భద్రతా వారోత్సవాలల్లో భాగంగా శనివారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రహదారిపై వాహణదారులు తప్పనిసరిగా భద్రత నియమాలు పాటించాలన్నారు. విద్యార్థులు చట్టాల పట్ల అవగాహణ కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలు జరగకుండా తీసుకొనే జాగ్రత్తలు, రోడ్డు నియమనిబంధనలను ఆయన కళాశాల విద్యార్థులకు వివరించారు. డగ్స్ వాడకంపై అవగాహణ కల్పించారు. అదే విధంగా గంజాయి అక్రమంగా తరలించినా, సేవించినా వారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ కల్పన, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటినుంచి ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంట్ బృందాల పర్యటన

ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 3: సింగరేణి ఇల్లెందు ఏరియాలో కంపెనీ స్థాయిలో ఉన్న పలు అంశాలను వివరించేందుకు ఈ నెల సోమవారం నుంచి వివిధ మైన్లు, డిపార్ట్‌మెంట్లలో బృందాలు పర్యటించనున్నట్లు సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. 6వ తేదీ జేకే 5 ఓసీ, 7న కోయగూడెం ఓసీ, 8న ఏరియా వర్క్ షాప్ సీహెచ్‌బీ జీఎం కార్యాలయంలో ఈ బృందాలు పర్యటించి కంపెనీకి సంబంధించిన అంశాలను వివరించనున్నట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎనలేనిది



సర్పంచ్ రాములును సన్మానిస్తున్న దృశ్యం

జూలూరుపాడు, ఫిబ్రవరి 3: గ్రామ అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎనలేనిదని ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ తాళ్లూరి రవి అన్నారు. పంచాయతీ సర్పంచ్‌ల, పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో శనివారం మండలంలోని చింతలతండా, కాకర్ల గ్రామంలో పాలక వర్గ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు బి.రాములు, బి.రమాదేవిలతో పాటు, వార్డు సభ్యులకు గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శులు శాలువలు కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో సర్పంచ్‌లు కీలకంగా వ్యవహరించారని, వారి సేవలు మరువలేనివని అన్నారు. కోవిడ్ సమయంలో సర్పంచ్‌లు విశేషంగా శ్రమించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాకర్ల ఎంపీటీసీ పొన్నెకంటి సతీష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, నానిబాబు, తిరుపతిరావు, ఇస్మాయేల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి: ఎంఈవో

జూలూరుపాడు, ఫిబ్రవరి 3: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ అన్నారు. శనివారం మాచినేనిపేటతండా పంచాయతీ పరిధిలోని పెద్దతండా ప్రాథమిక పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు గత కొన్ని రోజుల క్రితం బదిలీ కావడంతో వారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలలో నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్న పాఠశాలల పరిధిలోని గ్రామాలలో ప్రజల మన్నలను చూరగొనాలని, ఉత్తమ బోధనను సాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, హెచ్‌ఎంలు జుంకీలాల్, సంజీవరావు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభద్ర, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు విజయ, పుల్లారావు, దేవేందర్, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 3: రైల్వే ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్డు) ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాషాకు శనివారం వినతి పత్రాన్ని కొవ్వూరు రైల్వే సాధన కమిటీ సభ్యులు, అఖిల పక్ష నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలోనే అత్యధిక లాభాలు గడిస్తున్న కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో రైల్వే సర్వీస్‌లు పునరుద్ధరించాలని కోరారు. కరోనా కంటే ముందు నడిపించిన రైళ్లు అన్నింటిని తిరిగి ప్రారంభించి రైల్వే ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కేవలం బొగ్గు రవాణాకే కాక ప్రయాణికులకు సైతం రైల్వే సేవలు అందాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి, ఈ విషయమై అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొదమసింహం పాండురంగాచార్యులు, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, సలిగంటి శ్రీనివాస్, హరికృష్ణ, భాను, ధర్మ, వీరభద్రం, గుప్తా, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విలువిద్య శిక్షణ తరగతులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 3: ఉచిత విలువిద్య శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌వో పరంధామరెడ్డి కోరారు. వయస్సుతో నిమిత్తం లేకుండా విద్యార్థులు, బాలబాలికలు, యువత ఈ శిక్షణలో పాల్గొనవచ్చు అని ఆహ్వానించారు. పాల్వంచలోని శ్రీనివాసనగర్‌లో నిర్మించిన మినీ స్టేడియంలో శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో ఉదయం, సాయంత్రం రెండు పూటల శిక్షణ తరగతులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కోచ్ టి.కళ్యాణ్ 9515723780 ఫోన్ నెంబర్‌ను సంప్రదించి తమ వివరాలను తెలపాలన్నారు. ఉత్సాహవంతులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంటలకు సూక్ష్మ పోషకాలు వాడాలి

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 3: రైతులు సూక్ష పోషకాలు వాడాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. శనివారం ఆయన కేవీకే శాస్త్రవేత్తలతో కలిసి జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, చుంచుపల్లి, చంద్రుగొండ, సుజాతనగర్, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి తదితర మండలాల్లో కృషి విజ్ఞాన కేంద్రం, కొత్తగూడెం శాస్త్రవేత్తలతో, ఉద్యాన అధికారులు మామిడి తోటలను సందర్శించి, పరిశీలించి ప్రస్తుతం చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు రైతులకు తెలిపారు. రైతులు సూక్ష్మ పోషకాలు వాడాలని సూచించారు. తామర పురుగులు నివారణకు ఫిప్రోనిల్ 2ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, అలాగే బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 2 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. రైతులు పండు ఈగ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు వివరించారు. రైతులు ఫ్రూట్ బ్యాగింగ్ చేయుట, కార్బయిడ్ రహితంగా మాగించుట లాంటి మేలైన పద్ధతులతో పాటు, కోత అనంతర చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే హెడ్ అండ్ కీటక శాస్త్రవేత్త డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు, డాక్టర్ ఎస్.నవీన్, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ బి.శివ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులే టార్గెట్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 3: చిరువ్యాపారులే టార్గెట్‌గా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని కొత్తగూడెం సైబర్ క్రైమ్ డీఎస్పీ కృష్ణయ్య అన్నారు. ఇటీవల కొత్తగూడెం సమీప ప్రాంతాలలో చికెన్ షాపులో కొనుగోలు చేసిన అనంతరం నగదు లావా దేవీల్లో యజమానికి తెలియకుండా ఫోన్ పే నుంచి రూ.2000లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు అందిందన్నారు. అదేవిధంగా పరుపుల దుకాణంలో రూ.72 వేలు పరుపులు, కుర్చీలు కొనుగోలు చేసి నగదు చెల్లించకుండా ఆ వ్యాపారులను మోసం చేసినట్లు మరో ఫిర్యాదు తమకు అందిందన్నారు. ఏదైనా వ్యాపారులు వారు కొనుగోలు, అమ్మకాలు చేసే సమయంలో నేరుగానే లావాదేవీలు జరపాలని సూచించారు. అంతేకాకుండా ఫోన్ పే, ఇతర నగదు లావా దేవీల సమయంలో ఓటిపి వచ్చింది మాకు చెప్పండి అనే కస్టమర్లకు దూరంగా ఉండాలని తెలిపారు. ఇలాంటి కస్టమర్లపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని తక్షణ సహాయంగా డయల్ 100 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

వేడుకకు హాజరైన చినజీయర్‌స్వామి



మాట్లాడుతున్న జీయర్ స్వామి

కొత్తగూడెం సాంస్కృతికం, ఫిబ్రవరి 3: కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో శనివారం అత్యంత వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. చినజీయర్‌స్వామి విశిష్ట అతిధిగా హాజరయి మాట్లాడారు. జీవితం అంటే శరీరంతో ఆత్మ కలసి ప్రయాణం చేయడమేనని ఆధ్యాత్మిక సందేశాన్ని వినిపించారు. వేలాదిగా భక్తులు హాజరై వైకుంఠదాముడి కల్యాణాన్ని కనులార వీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, నిర్వాహకులు డాక్టర్ వి.విజయ్‌కుమార్, భక్తగ్రేసర బృంద వికాసరంగణి సభ్యులు డాక్టర్ నాగరాజు, ఎంవీ చౌదరి పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న చిన జీయర్ స్వామి

భద్రాచలం: చినజీయర్‌స్వామి భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. దేవస్థానం వైదిక సిబ్బంది స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఫలాలను అందించారు.

మాతృ మరణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శిరీష

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 3: జిల్లాలో గర్భస్థ తల్లులు, శిశువుల మరణాలను నివారించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష ఇమ్యూనైజేషన్ అధికారులకు సూచించారు. శనివారం ఐడీవోసీలోని తన కార్యాలయంలో సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశారు. ప్రాథమిక స్థాయిలోనే పిల్లల అనారోగ్య సమస్యలను గుర్తిస్తే, మరణాలను నివారించవచ్చు అన్నారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు డెలవరీ సమయం వరకు వైద్యులు సూచించిన సలహాలు, సూచనలు పాటిస్తే ప్రశాంత ప్రసవానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో వైద్యులు డాక్టర్ వీరబాబు, డాక్టర్ పుష్పలత, డాక్టర్ బాలాజీ, సీహెచ్‌వో నాగభూషణం, డిప్యూటీ డెమో ఫైజ్ మోహీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు అంశాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఖమ్మం నగర పాలక సమావేశంలో మేయర్ నీరజ

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి3: కార్పొరేటర్లు తెలిపిన సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి, పరిష్కార చర్యలు చేపట్టాలని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ కోరారు. ఖమ్మం నగరపాలకసంస్థ కౌన్సిల్ సమావేశం మేయర్ అధ్యక్షతన నగర పాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి సమక్షంలో శనివారం నిర్వహించారు. పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాల ఉపయోగార్థం నుంచి నివాసయోగ్యంగా మార్పునకు సంబంధించిన 6అంశాలకు ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు పంపేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ కోరారు. ఇంటినెంబర్లు కేటాయింపు విషయంలో విచారణ చేసి తగిన చర్యలు చేపడతామని కమిషనర్ ఆదర్శ్‌సురభి తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, సహాయ కమిషనర్ బీ. సత్యనారాయణరెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్, అర్బన్ తహసీల్దార్ సీహెచ్. స్వామి పాల్గొన్నారు.